



అయినవిల్లిలో వేడుకగా శ్రీపంచమి

వార్త..6లో



అధికారులు స్వాధీనం చేసుకున్న ఎక్సకవేటర్

ఏం చేసుకుంటారో చేస్కోండి..

అధికారులు సీజ్ చేసిన ఎక్సకవేటర్ తాళాలను దర్జాగా పట్టుకెళ్లిపోయిన తువ్వ మట్టి మాఫియా సభ్యులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారులంటే కనీసం గౌరవం, భయం లేకుండా చెలరేగిపోతున్నారు ఇసుక తువ్వ మట్టి మాఫియాకు చెందిన వారు. అనుమతులు లేకుండా యంత్రాలు ఎలా తీసుకువస్తారని ప్రశ్నించి అధికారులు అదుపులోకి తీసుకుంటే...ఏకంగా సంబంధిత యంత్ర పరికరం తాళాలనే దర్జాగా తీసుకుపోయి ఏం చేసుకుంటారో చేస్కోండి అన్నట్లు ప్రవర్తించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి లంకలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మానేపల్లి గ్రామ పరిధిలోని పెరుగులంకలో తువ్వ మట్టి తవ్వకాలు జరిపేందుకు ఒక ప్రైవేటు కంపెనీ పేరుతో తెరమీదకు వచ్చారు. సోమవారం ర్యాంపు ఏర్పాటు, బాట పనులు నిమిత్తం ఎక్సకవేటర్ కూడా గోదావరి నదీ తీర ప్రాంతానికి తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న తహశీల్దార్ తన సిబ్బందితో పాటు ఎస్ఐకు కూడా సమాచారం అందించి ఎక్సకవేటర్‌ను సీజ్ చేసి బయటకు తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఎస్ఐ బి.శివకృష్ణ, ఆర్ఐ వి.డాంగే (వర్మ), వీఆర్వో వి.సత్యనారాయణ, ఇద్దరు కానిస్టేబుల్స్ (సూజన్, అశోక్) లంకలోకి వెళ్లి ఎక్సకవేటర్‌ను బయటకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే గోదావరి నదీ తీరం నుంచి కొబ్బరి తోటలు దాటుకుని కూతవేటు దూరం వచ్చే సరికి ఒక ప్రైవేటు సంస్థ పేరుతో నలుగురు వ్యక్తులు వచ్చి తమకు అనుమతులు ఉన్నాయని చెప్తూ...ఎక్సకవేటర్ తరలింపును అడ్డుకున్నారు. అధికారులు ఉండగానే ఆ నలుగురు వ్యక్తులు ఎక్సకవేటర్ తాళాలను తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు అధికారులు తెలిపారు. కాగా వారు తాళాలు తీసుకుని వెళ్తుంటే చేసేది లేక రెవెన్యూ, పోలీసు సిబ్బంది ప్రేక్షక పాత్ర పోషించడం గమనార్హం.

రొయ్యల సీడ్ సేకరణ లీజు అంశంపై కలెక్టర్ సమీక్ష

వివాదం పరిష్కారం దిశగా చర్యలు

ఇరు జిల్లాల అధికారులతో

కలెక్టర్ మహేష్‌కుమార్ చర్చలు

అమలాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ ఎగువ, దిగువ భాగాల్లో రెండు కిలోమీటర్ల మేర రొయ్య పిల్లల విత్తనం(సీడ్) సేకరణ లీజుకు సంబంధించి నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. రొయ్య సీడ్ సేకరణకు సంబంధించి ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకార సహకార సంఘాల మధ్య గత కొంతకాలంగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు జిల్లాల మత్స్యశాఖ, జలవనరుల శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారించి చట్టబద్ధంగా ఇరుసంఘాల ఆమోదంతో వివాదాన్ని పరిష్కరించాలని ఆదేశించారు. వివాదం నెలకొనడానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లుగా ఇరు సంఘాలు రొయ్యల పిల్లల సేకరణ ద్వారా పొందుతున్న ఆదాయం, ఎంతమంది జీవనోపాధి పొందుతున్నదీ గణాంకాలు రూపొందించాలని, ఇరు సంఘాలకు ఆమోదయోగ్యమైన పరిష్కార మార్గాన్ని సూచించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రొయ్యపిల్లల విత్తన సేకరణ కోసం అద్దెకు ప్రతిపాదించిన గేట్లు లీజులు, సరిహద్దు వివాదానికి చర్యలు చేపడుతూ రొయ్యపిల్లల సేకరణకు సమగ్ర విధానాన్ని రూపకల్పన చేయాలన్నారు. గోదావరి బ్యారేజీ వద్ద లభించే రొయ్య పిల్లలకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఆరోగ్యపరంగా కూడా మంచి పోషకాలు గల ఆహారమన్నారు. జెప్రాన్ (రొయ్యపిల్లలు) కలెక్షన్ ధవళేశ్వరం క్యాటన్ బ్యారేజీ వద్ద మాత్రమే జరుగుతుందన్నారు. మ్యాప్‌ల రూపకల్పనలో భాగంగా ఇరు జిల్లాల్లో వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, వాటిని పునఃపరిశీలన చేయాలన్నారు. సుదీర్ఘ కాలంగా నెలకొన్న సంఘాల సమస్యలకు త్వరితగతిన సమగ్ర విధానాన్ని రూపొందించి ఇరు సంఘాల జీవనోపాదులకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గోదావరి హెడ్ వర్క్స్ కార్యనిర్వాహక ఇంజనీర్, నదీ సంరక్షణాధికారి ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, కోనసీమ జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

వివిధ కార్యక్రమాల అమలు ● డీఈవో షేక్ సలీంబాషా



అమలాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడానికి కఠినమైన ప్రణాళికలను అమలు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సోమవారం తెలిపారు. ప్రతీ పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక విద్యా ప్రేరణ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. చదవులో వెనుకబడి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ఉదయం, సాయంత్రం, సెలవు దినాల్లో అదనపు తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్‌సీఈఆర్టీ అందించిన మూడు మోడల్ పేపర్లను ప్రతీ విద్యార్థి పూర్తిగా అభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఏడు దశల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. ఎనిమిదో దశలో ఎస్‌సీఈఆర్టీ మొదటి మోడల్ పేపర్, ఆపై ప్రీఫైనల్, అనంతరం మిగిలిన రెండు మోడల్ పేపర్ల పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రెండో వారంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటుచేసి జిల్లాలోని హైస్కూళ్లను సందర్శించే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించి తక్కువ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను టాస్క్‌ఫోర్స్ బృందం సూచిస్తుందన్నారు. పరీక్షల పట్ల అనవసర ఆందోళన, శారీరక భావోద్వేగ ప్రతికూలతలను తొలగించాలన్నారు. పరీక్షలే జీవితం కాదని, ఒక భాగం మాత్రమేనని విద్యార్థులకు ధైర్యం నూరిపోయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



ఖాళీ..రైలు!

రైల్వే బడ్జెట్‌లో నిరాశే

నిర్మలమ్మ పద్దు జిల్లాలోని రైల్వేకి నిరాశను మిగిల్చింది. గతంలో ఇచ్చిన కేటాయింపులనే ఇప్పుడు మళ్లీ కొత్తగా ప్రకటించడంపై గోదావరి వాసులు విస్తుపోతున్నారు. పుష్కరాలకు ఇంకో రెండేళ్ల సమయం మాత్రమే ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కొత్త లైన్లు గానీ, కొత్త రైళ్లు గానీ లేవు. వందేభారత్ రైళ్లనే తెరపై చూపిస్తూ సామాన్యుల ప్రయాణ పాట్లను పక్కన పెట్టేశారు. మొత్తానికి కేంద్రం, రాష్ట్రంలో మంచి పరిచయాలున్న పురందేశ్వరి ఎంపీగా ఉన్నా జిల్లాకు అమృత్ భారత్, వందే భారత్ తప్ప ఈ బడ్జెట్‌లో మరేమీ ఒరగక పోవడంపై విమర్శలు వినవస్తున్నాయి.

- నాటి అమృత్ నిధులే.. కొత్తగా..
- బడ్జెట్‌లోనూ ఆ రూ.270 కోట్లే
- పుష్కరాల నిధులపై క్లారిటీ నిల్
- గతంలో ఇచ్చినవే కొత్తగా చెప్పిన వైనం
- కడియం-నిడదవోలు లైన్‌కు నిధులేవి!
- కొవ్వూరు,అనపర్తిలో హాల్ట్‌ల ఊసేలేదు
- వృద్ధులు, జర్నలిస్టుల రాయితీ మరిచారు
- బడ్జెట్‌లో రైల్వే నిధులపై పెదవి విరుపు
- సామర్లకోటకు కేటాయింపుల్లేవ్

రాజమహేంద్రవరం/సామర్లకోట,ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): అంతా పాతే.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన రైల్వేస్టేషన్లకు కొత్త కేటాయింపులు లేకపోవడంతో రైల్వే బడ్జెట్ నిరాశమిగిల్చింది.2027లో గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఖచ్చితంగా కేటాయింపులు ఉంటాయని అంతా ఆశించారు.అయితే ఏమీ లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు. కేంద్ర రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రైల్వేస్టేషన్ల అభివృద్ధికి తాజాగా నిధులేమీ కేటాయించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిలిపివేస్తున్న పలు రైళ్లను యథాతథంగా నడిపేందుకు తాజాగా రైల్వే ఏ కీలక నిర్ణయం తీసుకోలేదు.

ఇప్పటికే అధికం

రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు ఇప్పటికే సామర్థ్యానికి మించి రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. గూడ్స్ రైళ్లతో కలిపి 200 రైళ్ల పరుగులు పెడుతున్నాయి. దీంతో ఒక రైలుకు, మరో రైలుకు మధ్య ప్రయాణ నిడివి బాగా తగ్గిపోయింది. ఈ క్రమంలో పుష్కరాలకు కొత్త రైళ్లు వేస్తే వాటిని ఎలా నడిపిస్తారో చూడాల్సి ఉంది. ఆర్చ్ బ్రిడ్జి నిర్మించిన సమయంలో పక్కనే మరో వంతెన నిర్మాణానికి అనువుగా స్పాన్ (స్తంభాలు)లలో ప్రొవిజన్ పెట్టారు. అంటే ఇప్పుడు వంతెన నిర్మిస్తే సరిపోతుంది. స్పాన్‌లు నిర్మించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న ఆర్‌సీఆర్‌బీ,ఆర్చ్ బ్రిడ్జిలపై ట్రాఫిక్ దృష్ట్యా రైళ్లను కొవ్వూరులో లేదా ఔటర్‌లో కొద్ది సేపు నిలపడం చేస్తున్నారు. దీంతో ఆర్చ్ బ్రిడ్జిపై వంతెన నిర్మాణమైతే చాలా ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా కడియం నుంచి నిడదవోలు వరకూ లైను వేయడం ద్వారా గూడ్స్ రైళ్లను మళ్లించడం ద్వారా రాజమండ్రి స్టేషనుపై ఒత్తిడి తగ్గించవచ్చునే ఆలోచన చేస్తున్నారు.ఈ లైను విషయం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. దీని నిధుల విషయం కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. నిడదవోలు రైల్వేస్టేషన్‌లో 1.5 కిలోమీటర్ల లూప్ లైను నిర్మిస్తున్నామని మాత్రం చెప్పారు.

నాటి అమృతమే.. నేడేం లేదు..

ఆంధ్ర ప్రదేశ్‌లోని అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పథకంలో 72 ప్రధాన రైల్వేస్టేషన్లను రూ.3,141 కోట్ల మేర నిధులతో అభివృద్ధి చేసేందుకు గతేడాది ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు సుమారు రూ.271 కోట్లు, సామర్లకోట స్టేషన్‌కు రూ.15.13 కోట్లు కేటాయించారు. ప్రస్తుత రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా ఉంటాయని ఆశించారు. ఏమీ లేకపోవడంపై ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిడదవోలుజంక్షన్, కొవ్వూరు, రాజమహేంద్రవరం,కడియం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, అన్నవరం తుని వంటి స్టేషన్లు ఉన్నా కనీసం పట్టించే లేదు.రాజమ హేంద్రవరం,సామర్లకోట వంటి ప్రధాన రైల్వే స్టేషన్లలోనూ అమృత్ అభివృద్ధి పనుల్లో వేగం లేదు..

పుష్కరాలకు నిధుల్లేవ్..

కుంభమేళాకి ప్రయాగ్‌రాజ్.. గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం. 2027లో పుష్కరాలు జరగనున్నాయి.ఈ మేరకు ఇప్పటి నుంచీ నిధులు సమకూరితే తప్ప ప్రయోజనం ఉండదు.ఈ బడ్జెట్‌లో పుష్కరాలకు నిధుల కేటాయిస్తారని గోదావరి జనం ఆశించారు.కానీ అమృత్ భారత్ కింద రాజమహేంద్రవరం,నిడదవోలు,సామర్లకోట రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని మాత్రమే పేర్కొన్నారు.ఇప్పటికే రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు రూ.271 కోట్లు కేటాయించారు. పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి.దీన్నే కొత్తగా ఇచ్చినట్లు చూపించడం విస్మయానికి గురిచేస్తోంది. రాజమహేంద్రవరం ఎంపీగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉన్నా కేటాయింపులు లేకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.ఇక కొవ్వూరు-సత్తుపల్లి రైల్వే లైను గురించి ప్రస్తావన లేకపోగా..కరోనా సమయంలో కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో రైళ్ల హాల్ట్ నిలుపుదల చేశారు.అదే సమయంలో వృద్ధులకు,జర్నలిస్టులకు రైలు ప్రయాణాల్లో ఇచ్చే రాయితీని తీసేశారు.ఈ సారి బడ్జెట్‌లో వీటి పునరు ద్ధరణపై ప్రకటన వెలువడుందని ఆశించినా నిరాశే మిగిలింది. రాజమహేంద్రవరం నుంచి బెంగళూరు,భువనేశ్వర్‌లకు రెండు వందేభారత్ రైళ్లను గతంలోనే ప్రకటించారు. ప్రస్తుతం వాటి నిమిత్తం రాజమహేంద్రవరం మెము కార్ షెడ్‌లో పనులు జరుగుతున్నాయి.ఇవి కాకుండా హైదరాబాద్, బెంగళూరు,భువేశ్వర్‌లకు సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రాజమండ్రి నుంచి బయ లుదేరే విధంగా నడపాలనే డిమాండ్ ఉన్నా నిరాశే మిగిలింది.

గోదావరి స్టేషన్ వదిలేశారా?

రాజమహేంద్రవరంలో గోదావరి రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. పుష్కరాల సమయంలో ఈ రైల్వే స్టేషను రద్దీలో భాగం పంచుకుంది.ఈ రైల్వేస్టేషను పుష్కర, కోటి లింగాల ఘాట్లకు దగ్గరగా ఉండడంతో ఎక్కువ మంది జనం ఈ రైల్వేస్టేషనులోనే దిగుతారు. పైగా సాధారణ రోజుల్లో కూడా ఇక్కడ రైళ్లను ఆపాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.ఈ రైల్వేస్టేషన్‌ని పుష్కరాలనాటికి అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఇలా రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి నిధులనే బడ్జెట్‌లో చూపించి సరిపెట్టుకోమనడంతో బడ్జెట్‌పై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

ఆర్వోబీలు, ఆర్‌యూబీలు ఎక్కడ?

రైల్వేగేట్లవద్ద ప్రమాదాలను శాశ్వతంగా నివారించేందుకు, ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు 2027 నాటికి అన్ని రైలు గేట్లను తొలగిస్తామన్న రైల్వే గతంలో చేసిన ప్రకటన నేడు ప్రచారంలో లేకపోవడం విచారకరం. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో గూడూరు నుంచి అనకాపల్లి స్టేషన్ల మధ్య 390 రైలు గేట్లు ఉన్నట్టు గతంలోనే రైల్వే అధికారులు గుర్తించారు.వీటిని తొలగించి ఆర్‌యూబీలు, ఆర్వోబీలు నిర్మిస్తామన్నారు.వీటికోసం రూ.2,400 కోట్ల మేర నిధులు ప్రతి పాదించారు.ప్రస్తుత బడ్జెట్‌లో వీటి నిర్మాణాలకు నిధులు కేటాయింపులు లేకపోవడంపై రైల్వే అధికారులు ఖంగుతిన్నారు.



చూసొద్దాం రండి అంతర్వేది వైభవం

సాగర సంగమ తీరాన కోరిన కోరికలు తీర్చే భక్తజన వరధుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి. ఆ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు 4వ తేదీ మంగళవారం రథసప్తమి పర్వదినాన ప్రారంభమవుతాయి. మంగళవారం నుంచి పది రోజుల పాటు స్వామివారి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముగింపులో అంతర్వేది ఆలయ ఉత్తర భాగంలో ఏర్పాటు చేసిన చెరువులో హంస వాహనంపై స్వామి-అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

● (అంతర్వేది/ఆంధ్రజ్యోతి)

- నేటి నుంచి స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు
- అంతర్వేదిలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు
- మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ
- పది రోజుల పాటు ఘనంగా జరగనున్న ఉత్సవాలు



నేడు స్వామి వారు పెండ్లికొడుకాయెనే..

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులు సంయుక్త నిర్వహణలో మంగళవారం ఉదయం నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా రథసప్తమి రోజున ఈ రెండు కుటుంబాల వారిచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నసమారాధన జరుగుతుంది. బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే స్వామివారికి మధుపర్కములు సమర్పించి మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరిస్తారు. స్వామి-అమ్మవార్లకు ఆలయ అర్చకులు, వేద పండితుల సారథ్యంలో ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాలకు లక్షలసంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.







విద్యుత్ దీపాలంకరణ

అంతర్వేదికి ఇలా రావొచ్చు..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి అంతర్వేది చేరుకునే భక్తులు రావులపాలెం, రాజోలు మీదుగా రావాల్సి ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చే భక్తులు పాలకొల్లు, దిండి-చించినాడ వంతెన మీదుగా శివకోడు, మలికిపురం మీదుగా రావచ్చు.



ఉత్సవ ఏర్పాట్లను వివరిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



భారీ బందోబస్తు

స్వామివారి ఉత్సవాల్లో ముఖ్య భూమిక పోషించే పోలీసులు, బందోబస్తు మరింత పటిష్ఠంగా ఏర్పాటు చేయనున్నారు. వెయ్యి మంది పోలీసు సిబ్బందితో 9 సెక్టార్లుగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఒక ఎస్పీ, ఒక అడిషనల్ ఎస్పీ, 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలతో ఉత్సవాల్లో బందోబస్తు నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రధాన రోజుల్లో 20 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ జరుగుతుంది. ఎస్డీఆర్ఎఫ్, స్పెషల పార్టీ, మెరైన్ పార్టీలతో పర్యవేక్షణ, 100 సీసీ కెమెరాల ఏర్పాటు, డిజిటల్ డిస్‌ప్లే, 12 ఎల్ఈడీ స్ర్కీన్లతో భక్తులకు స్వామివారి కల్యాణం తిలకించే అవకాశం. క్యూలైన్లలో పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఆరు ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు. కల్యాణం అనంతరం భక్తులకు అక్షింతల పంపిణీ జరుగుతుంది.

పెంచిన ఆర్టీసీ బస్సు సర్వీసులు

లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అమలాపురం, రాజోలు, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, పాలకొల్లు డిపోల నుంచి 105 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. కల్యాణోత్సవాలకు బస్సులను సిద్ధం చేశామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అంతర్వేదికి రాజోలు నుంచి 31 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం నుంచి 104, అమలాపురం నుంచి 63, కాకినాడ నుంచి 118 కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి 41 కిలోమీటర్లు, భీమవరం నుంచి 64 కిలోమీటర్లు.

4 లక్షల మంది వస్తారని అంచనా..

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేవాదిదేవుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. స్వామివారి ఆలయంలో సోమవారం విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి మీడియాకు ఉత్సవాల ఏర్పాట్ల గురించి తెలిపారు. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అంతర్వేది పుణ్యక్షేత్రానికి స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు సుమారు 4లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. ఫిబ్రవరి 4 నుంచి 13వ తేదీ వరకు దివ్యతిరు కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, కూటమి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తూ 7న జరిగే కల్యాణం, 8న రథోత్సవం, 12న చక్రస్నానం, 13న జరిగే తెప్పోత్సవాల కార్యక్రమాలకు ఉన్నతాధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రధానంగా ఆలయానికి చేరుకునే రహదారులను ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.22.31 కోట్ల నిధులతో ఎనిమిది పనులు చేపట్టామన్నారు. పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.22.30 లక్షల నిధులతో మూడు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాబహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, కొప్పుల ఫణికుమార్, ముప్పర్తి నాని, బైరా నాగరాజు, పొన్నాల ప్రభ, పిండి సత్యనారాయణ, పోతురాజు కిశోర్, రావూరి నాగు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో అత్తిలి వారిచే పవన్‌వైష్ణవ కోలాట భజన మండలి ప్రదర్శన, 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు కేరళ వాయిద్యాలతో స్వామివారి గ్రామోత్సవం. 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగర సంకీర్తనతో స్వామివారి గ్రామోత్సవం. 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సుమారు 500 మంది మహిళా భక్తులచే లలితాసహస్ర పారాయణం. 10వ తేదీ రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ సురభి వారిచే స్వామివారి కల్యాణోత్సవ ప్రాంగణంలో మాయాబజార్ నాటకం, 11వ తేదీ రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ సురభి వారిచే భక్త ప్రహ్లాద నాటకం జరుగుతాయి.

సత్రాల్లో ఉచిత భోజనం

తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తులకు 60 సత్రాల ద్వారా ఉచిత భోజన సదుపాయం అందిస్తారు. 7, 8, 12, 13 తేదీలతో పాటు ప్రధానంగా 8న సుమారు 2లక్షల మంది భక్తులకు సత్రాల్లో అన్నసమారాధన జరుగుతుంది. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం రాజోలు డిపో నుంచి 40 బస్సులు, ఇతర డిపోల నుంచి 65 బస్సులు మొత్తం 105 బస్సు సర్వీసులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవాల్లో ఐదు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం లోపల, బయట. అటుకుల మండపం వద్ద ఎంపీపీ స్కూలులో, బస్టాండు, యాత్రికుల షెడ్డు, బీచ్ ప్రదేశాల్లో శిబిరాలు జరుగుతాయి. 108 వాహనాలు 3, 104 వాహనం 1, 26 మంది మెడికల్ సిబ్బంది, 85 మంది పారా మెడికల్ సిబ్బందితో మొత్తం 111 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎవరికి ఎటువంటి సమస్యలున్నా శిబిరాలకు రావాలని అధికారులు కోరారు.



వెండి కవచ అలంకరణలో శ్రీరంగనాయకస్వామి

శ్రీరంగనాయక స్వామికి 6.129 కిలోల వెండి కవచం బహూకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలోని ఉపాలయంలో గల శ్రీరంగనాయకస్వామికి తెనాలికి చెందిన ఆలపర్తి పవన్‌కుమార్-జాహ్నవి దంపతులు, కుటుంబ సభ్యులు 6.129 కిలోల వెండి కవచాన్ని బహూకరించారు. తొలుత కవచానికి ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ జరిపి రంగనాయకస్వామికి అలంకరించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాబహదూర్, ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య, ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెండి కవచాన్ని బహూకరిస్తున్న పవన్‌కుమార్-జాహ్నవి దంపతులు

మనుమరాలి అక్షరాభ్యాసంలో సినీ నిర్మాత డీవీవీ దానయ్య

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం అధిక సంఖ్యలో అక్షరాభ్యాసాలు జరిగాయి. తన మనుమరాలితో అక్షరాభ్యాసం చేయించడానికి వచ్చిన ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఓజీ' సినిమాను వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరించే విందు భోజనంలా ఉంటుందన్నారు. ఓజీ సినిమా పూర్తియిన తర్వాత మరికొన్ని ప్రాజెక్టులను తెరపైకి తీసుకువచ్చే ఆలోచన ఉందని చెప్పారు.





అయినవిల్లిలో ప్రత్యేక అలంకరణలో సరస్వతీ దేవి, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

అయినవిల్లిలో వేడుకగా శ్రీపంచమి

అయినవిల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి పుణ్యక్షేత్రంలో వసంత పంచమి (శ్రీపంచమి)ని సోమవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ జరిపి సిద్ధివినాయకుని చెంత కలాలను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసిద్ధివినాయక స్వామి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయిస్తే విద్యాభివృద్ధికి ఆటంకాలు ఉండవని భక్తుల విశ్వాసం. దీంతో అక్షరాభ్యాసాల కోసం పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. అధికారుల అంచనాలకు మంచి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారులతో



శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయంలో సరస్వతి, కలాల పూజ

పలకలపై 'ఓం నమః శివాయ నమః సిద్ధం నమః' అని తల్లిదండ్రులు, అర్చకస్వాములు, వేదపండితులు రాయించారు. భక్తులకు ఆలయ సహాయ కమిషనరు ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సేవలందించారు. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సోమవారం ఒక్కరోజు వివిధ సేవల ద్వారా రూ.6,13,639 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనరు సత్యనారాయణరాజు చెప్పారు.

అయినవిల్లిలో సిద్ధి వినాయకస్వామికి జరిగిన కలాల పూజ



వసంతి పంచమి సందర్భంగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ప్రత్యేక అలంకరణలో లలితా అమ్మవారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని ఓ ప్రైవేటు స్కూలులో సరస్వతీదేవికి విద్యార్థినుల నృత్య నీరాజనం



తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

నాట్ 'గుడ్డు'



- పడిపోయిన గుడ్డు ధర
- పేపర్ ధర రూ.4.90పైసలు, కమింగ్ రేట్ రూ.4.37పైసలు
- కమీషన్లు పోను రైతుకు మిగిలేది రూ. 4.12పైసలే
- ధరలు ఇలా ఉంటే పౌల్ట్రీ పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకం

అనపర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడికి తక్కువ ధరకు లభ్యమయ్యే పౌష్టికాహారంలో ముందు వరుసలో నిలిచేది కోడి గుడ్డు అనేది జగమెరిగిన సత్యం. అయితే మొన్నటి వరకు పౌల్ట్రీ రైతులు రారాజులుగా ఉంటే గత ఐదేళ్లుగా పరిశ్రమ మనుగడ కష్టతరంగా మారింది. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగాను వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఫీడ్ ధరలతో కోళ్ల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి తోడు మందుల రేట్లు, విద్యుత్ ధరలు, ఇలా ప్రతీదీ పెరిగిపోవడం గుడ్డు ధర మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండటంతో కోళ్ళ పరిశ్రమ నష్టాల బాట పట్టింది. గతంలో టన్ను మేత ధర రూ.15వేల నుంచి రూ.30వేల వరకు ఉంటే ప్రస్తుతం మేత ధర టన్ను రూ.30 వేలకు పైబడి ఉంది. ఏడాదిలో సగం రోజులు గిట్టుబాటు ధర పలికేది. కానీ ప్రస్తుతం గిట్టుబాటు ధర రెండు నెలలు కూడా ఉండకపోవడంతో మిగిలిన పది నెలలు నష్టాల ఊబిలో కూరుపోవాల్సి వస్తుంది. ఇతర రాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమ అభివృద్ధి చెందడం అక్కడి ప్రభుత్వాలు పౌల్ట్రీ రైతులకు రాయితీలు కల్పించడం ఏపీ లో మాత్రం ఎటువంటి రాయితీలు లేకపోవడంతో రైతులు నష్టాల బాట పట్టాల్సి వస్తుంది. చలికాలం ప్రారంభం నుంచి కొత్త ఏడాది ప్రారంభం వరకు సుమారు నెల 15రోజుల పాటు రూ.6పైబడి పలికిన గుడ్డు ధర ప్రస్తుతం రూ.4.90పైసలకు పడిపోయింది. ప్రస్తుతం ఉన్న ఫీడ్ ధరల ప్రకారం ఒక గుడ్డుకు రూ.5 వరకు ఖర్చవుతుందని, కేవలం 45రోజులు మాత్రమే ఆరు రూపాయిల వరకు పలికి ప్రస్తుత ధర పడిపోయిందని రైతులు వాపోతున్నారు. పేపర్ ధర రూ.4.90 ఉన్నప్పటికీ ఎగుమతుల వద్ద డిమాండ్ లేకపోవడంతో ట్రేడర్లు కమింగ్ రేటుకు మాత్రమే ప్యాకింగ్‌లు చేయడంతో ప్రస్తుతం రైతులకు రూ.4.37పైసలను అందిస్తుండగా దీనిలో ట్రేడర్లు కమిషన్ రూ.0.25పైసలు పోవడంతో ఇక రైతుకు రూ.4.12పైసలు మాత్రమే మిగిలుతుంది. రానున్న రోజులు ఈ ధర మరింత పతనమయ్యే పరిస్థితులు ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉభయ గోదావరి జిల్లాల్లో...

ఉభయ గోదావరి జిల్లాల్లో రోజుకు కోటిన్నర గుడ్లు ఉత్పత్తి కావడంతో రైతులు రోజుకు కోటి నుంచి కోటిన్నర వరకు నష్టపోయే పరస్థితి ఏర్పడింది. లక్ష కోళ్లు ఉన్న పరిశ్రమలో సుమారు 70వేల గుడ్లు దిగుబడి ఉన్నా రోజుకు లక్ష నుంచి లక్షన్నర మేర రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. 2014 ఎన్నికల్లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కోళ్ల పరిశ్రమపై కొన్ని రాయితీలు ప్రకటించింది. దీంతో ఆ ఐదేళ్ల పాటు రైతులు నష్టాల బారిన పడినా కొంతమేర ఊరట చెందారు. కానీ తరువాత 2019లో వచ్చి న వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పౌల్ట్రీ రంగం వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదని కరోనా విపత్కర పరిస్థితిలో కూడా పరిశ్రమ తరపున అనేక సేవా కార్యక్రమాలు చేశామని కానీ ప్రభుత్వం మాత్రం మావైపు చూడలేదని కొందరు పౌల్ట్రీ పెద్దలు వాపోతున్నా రు. వచ్చేది వేసవి కాలం కావడంతో పరిశ్రమలో ఖర్చులు మరింత పెరుగుతాయని కోళ్లను కాపాడుకునేందుకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని, ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం పౌల్ట్రీ రంగ ంపై దృష్టి సారించి కోళ్ల మేతకు అవసరమైన నూకలు, మొక్కజొన్నలతో పాటు విద్యుత్ చార్జీల పైనా రాయితీలు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

తొలిరోజు ఒక నామినేషన్

ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ.. 8, 9 తేదీలు సెలవు



ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాజేంద్ర

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు నామి నేషన్ల స్వీకరణ తొలిరోజు సోమవారం ఒక నామినేషన్ దాఖలైంది. కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి పేపకాయల రాజేంద్ర ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అభ్యర్థి రాజేంద్రతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సోమవారం నామినేషన్లు స్వీకరణ చేపట్టగా ఈనెల 10 వరకు గడువు ఉంది. మధ్యలో ఈనెల 8, 9 తేదీలు సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 11న పరిశీలన, 13న మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంది. 27 ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. మార్చి 3న ఏలూరులో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికలకు 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి: ఆర్వో

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మొత్తం 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 3,15,261 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఇప్పటివరకు అందిన 8,501 క్లెయిమ్‌లు పరిశీలించి 5వతేదీలోపు ఈఆర్‌వో నెట్‌లో అప్‌డేట్ చేస్తామని ఆయన తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో వివాహిత ఆత్మహత్య

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కాకినాడ రాగంపేటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు రాగంపేటకు చెందిన వి.ఈశ్వర్, శిరీష రత్నప్రశాంతి (30) భార్యాభర్తలు. వారు ప్రే మించుకుని 2016లో వివాహం చేసుకున్నారు. వారికి 8ఏళ్ల బాబు ఉన్నాడు. వ్యక్తిగత కారణాలతో శిరీష రత్నప్రశాంతి సోమవారం మధ్యాహ్నం ఇంట్లో గదిలోకెళ్లి ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అది గమనించిన భర్త కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

వరకట్న వేధింపులే కారణం



మరణించిన బేబీరాణి

గొల్లప్రోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన శివకోటి బేబీరాణి (34), రాజులకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేబీరాణిని అదనపు కట్నం తీసుకురావాలని భర్త రాజు, అత్త ధనలక్ష్మి, మరిది శ్రీనులు వేధించడమే గాక శారీరకంగా, మానసికంగా హింసించేవారు. దీంతో ఆమె జనవరి 20న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బేబీరాణిని ఆమె తల్లి దడాల రమణ పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. తల్లి ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపులు, ఆత్మహత్య ప్రేరణ కింద కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఒంటిమామిడిలో..

పోలీసు బందోబస్తు నడుమ కొనసాగిన పైప్‌లైన్ పనులు

తొండంగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడిలో దివీస్ ఫార్మా పైప్‌లైన్ పనులు పోలీసు బందోబస్తు నడుమ సోమవారం కూడా కొనసాగాయి. ఆదివారం ఉదయం నుంచీ డీసాలినేషన్ పైప్‌లైన్‌ను సముద్రంలోకి వేస్తున్నారు. రెండో రోజు ముందు జాగ్రత్త చర్యగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దివీస్ ఫార్మా గేటు వద్ద టెంట్ వేసి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మరికొంత మంది పైప్‌లైన్ వేసే ప్రాంతంలో ఉన్నారు. సముద్రం నీటిని పైపులైన్ ద్వారా ఫ్యాక్టరీకి తరలించి నీటిని శుద్ధి చేసి మంచి నీటిని ఫ్యాక్టరీ అవసరాలకు వినియోగించే నిమిత్తం వేసే పైపులైన్‌గా దీనిని పేర్కొంటున్నారు. మరోవైపు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ టీడీపీ మత్స్యకార విభాగం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ, నేతలు చొక్కా కాశీశ్వరరావు, చొక్కా అప్పారావు, గంటా లక్ష్మణ్, మహంకాళి కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లారు.

అవగాహనతో కేన్సర్‌కు అడ్డుకట్ట!

ప్రారంభదశలో గుర్తిస్తే వైద్యసేవలతో సత్ఫలితాలు

రాజమహేంద్రవరం జీటీజీహెచ్‌లో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ సేవలు

నేడు కేన్సర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం



రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మారిన ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వంశపార్యంపర్య కారణాలతో కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నదని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు కేన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం మరింత ప్రమాదకరంగా పరిణమిస్తోంది. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే రేడియేషన్, కీమోథెరపీ ద్వారా చాలా వరకూ విస్తరించకుండా నివారించే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అయితే కేన్సర్‌పై ప్రజల్లో చైతన్యం రాకపోవడం ప్రాణాపాయ పరిస్థితుల్లోకి నెడుతున్నదని, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా జరుగుతున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా నివారణకు సూచనలు ఇలా..

స్ర్కీనింగ్ అత్యంత ముఖ్యం

కేన్సర్ వ్యాధి నివారణలో స్ర్కీనింగ్ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది. నివారణకు అవకాశం ఉన్న కేన్సర్లు అయిన రొమ్ము కేన్సర్, సర్వికల్ కేన్సర్, నోటి కేన్సర్‌లను ప్రారంభదశలోనే గుర్తించడం ద్వారా చాలా వరకూ నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అలాగే సేవల సమీకరణ జరగాల్సి ఉంటుంది. కమ్యూనిటీ స్థాయిలో ఎన్‌సీడీ 3.0 యాప్ ద్వారా ఆశా, ఏఎన్‌ఎంల సహకారంతో అనుమానిత వ్యక్తులను గుర్తించి అందుబాటులోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు పంపించడం ద్వారా సత్ఫలితాలు పొందే అవకాశం ఉంది. వీటితోపాటు కౌన్సెలింగ్, చికిత్స కౌన్సెలింగ్ ద్వారా నిర్ధారణ, అవసరమైన చికిత్సా సేవలను సమగ్రంగా అందించగలుగుతారు. వీటికితోడు ప్రజల్లో కేన్సర్‌పై అవగాహన పెరగాల్సి ఉంటుంది.

జీటీజీహెచ్‌లో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్)లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌లో కేన్సర్‌కు సంబంధించి పలు రకాలైన వైద్యచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ సర్జరీ, కీమో థెరపీ సేవలు లభిస్తున్నాయి. తల, మెడ సంబంధిత కేన్సర్‌లతోపాటు గైనిక్ సంబంధిత కేన్సర్లు, గ్యాస్ట్రో ఇంటెస్టినల్ కేన్సర్లు, స్కిన్ కేన్సర్లు వంటి వాటికి సర్జరీలు చేస్తున్నారు. వీటితోపాటు కీమో థెరపీ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌లో డాక్టర్ ప్రశాంత్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుండగా, ఒక గైనకాలజిస్ట్, ఒక రేడియేషన్ ఆంకాలజిస్ట్, సర్జికల్ అంకాలజిస్ట్, ఈఎన్‌టీ స్పెషలిస్టు, శస్త్ర చికిత్స నిపుణురాలు అందుబాటులో ఉన్నారు. ప్రతి మంగళవారం, గురువారం జీటీజీహెచ్ ఓపీ బ్లాకులోని 222 నెంబరు గదిలో ముందస్తు కేన్సర్ నిరోధక సేవల ఓపీ నిర్వహిస్తున్నారు.

ప్రజల్లో అవగాహన పెరగాలి

కేన్సర్ పట్ల గ్రామీణ ప్రాంతాల వారితో పాటు పట్టణవాసుల్లోనూ పెద్ద అవగాహన లేకపోవడంతో కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి. పొగాకు నమలడం, ధూమపానం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడంతో పాటు మంచి ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌కు దూరంగా ఉండవచ్చని జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ పేర్కొన్నారు.

నేడు కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలో మెగా పబ్లిక్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమవుతుంది. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్, జీఎస్‌ఎల్ కేన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

మానవత్వాన్ని మరిచారు!

వృద్ధురాలిని రోడ్డుపై వదిలేశారు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు నమ్మించి పెన్షన్ ఇస్తుండగా

అడ్డుకున్న యూనియన్ల ప్రతినిధులు



అమలాపురం ఆర్టీసీ డిపో ఇన్‌గేట్ ఎదుట వృద్ధురాలు బంగారమ్మ



సచివాలయ ఉద్యోగిని నిలదీస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 75 ఏళ్ల ఆ వృద్ధురాలి పేరు మద్దింశెట్టి బంగారమ్మ. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామం. మతిస్థిమితంలేని ఆమెను ఎవరో తీసుకొచ్చి కొన్ని నెలల క్రితం అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట వదిలేశారు. అప్పటి నుంచి ఆటో యూనియన్ ప్రతినిధులు, పండ్ల వర్తకులు ఆమె ఆలనా, పాలనా చూస్తున్నారు. ఏం జరిగిందో ఏమో గత కొంతకాలంగా నడవలేని స్థితిలో ఉంది. అయితే వృద్ధురాలి రక్తసంబంధీకులమని చెప్పి సోమవారం ఉదయం మందపల్లి సచివాలయ ఉద్యోగిని తీసుకుని అమలాపురం ఆర్టీసీ బస్టాండు సెంటర్‌కు వచ్చారు. ఆ వృద్ధురాలికి నడిరోడ్డుపైనే ఐరిష్ తీసుకుని పెన్షన్ సొమ్ములను అప్పగిస్తుండడాన్ని స్థానిక యూనియన్ ప్రతినిధులు గుర్తించారు. వెంటనే అడ్డుకుని వారిని నిలదీశారు. మూడు నెలలకు సంబంధించి రూ.12వేలు పెన్షన్ నగదును తీసుకున్న మహిళను స్థానికులంతా నిలదీశారు. కనీసం తిండి పెట్టడంలేదు. ఆలనా పాలనా చూడకుండా మానవత్వాన్ని విడిచిపెట్టి రోడ్డుపై వదిలేసి పెన్షన్ సొమ్ములు పట్టుకుపోతారా అని మండిపడ్డారు. దాంతో ఆ మహిళ వృద్ధురాలి సోదరినని చెప్పడంతో పాటు మీరెవరు అడ్డగించడానికని ఎదురు తిరిగింది. దాంతో వివాదం చెలరేగింది. మందపల్లి సచివాయలం నుంచి వచ్చిన ఉద్యోగిని ఆటో యూనియన్ నాయకులు నిలదీశారు. రోడ్డుపై పడి ఉన్న వృద్ధురాలి ఐరిష్ తీసుకుని పెన్షన్ ఎవరికో ఇచ్చేస్తారా, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు. వృద్ధురాలు అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని చెప్పారనడంతో వచ్చాను. 3 నెలలుగా పెన్షన్ తీసుకోకపోవడం వల్ల ఈసారి పెన్షన్ ఇవ్వకపోతే ఆమె పెన్షన్ నిలిచిపోతుందని చెప్పడంతో ఆమె సోదరితో వచ్చాను. ఆసుపత్రిలో కాకుండా రోడ్డుపై ఉన్న బంగారమ్మను చూసి మొదట పెన్షన్ ఇవ్వనని చెప్పానని ఆమె వారికి బదులిచ్చింది. ఆమె సూచన మేరకు యూనియన్ ప్రతినిధులైన మట్టపర్తి నారాయణ, కల్వకొలను బాబి మందపల్లి ఎంపీటీసీకి ఫోన్ చేసి సమాచారం అందించారు. దాంతో ఆయన సూచనల మేరకు పెన్షన్ కింద ఇచ్చిన రూ.12వేలు నగదుతో పాటు బంగారమ్మకు సంబంధించిన రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పెన్షన్‌కార్డు వంటివన్నీ ఆమె సోదరి నుంచి తీసుకున్నారు. వాటిని తమ వద్ద భద్రంగా ఉంచామని, ఆ గ్రామ పెద్దలు వచ్చిన తరువాత వాటిని పెద్దల సమక్షంలో అందజేస్తామని తిరుమనాథం బుజ్జి, చిన్నా, దంగేటి మంగరాజుతో పాటు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తెలిపారు.

కాకినాడలో...

ఐటా జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి); వివిధరాష్ట్రాల క్రీడాకారులకు కాకినాడలో ఆతిథ్యం ఇవ్వడం కాకినాడ జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో సోమవారం రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా అండర్ 16 టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నీవీ.రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నానాజీ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈనెల 3నుంచి 7వరకు జరిగే పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ డాక్టర్ శేషగిరి, ఆర్ఎంసీ మాజీ ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎల్.సత్యనారాయణ ఉన్నారు.



కాకినాడలో ఐటా జాతీయస్థాయి పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఈనెల 15నుంచి 28వరకు జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఏర్పాట్లను సోమవారం జేసీ రాహుల్‌మీనా పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న ఐఏస్ క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు, మైదానంలో టోర్నమెంట్ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలన్నారు. జేసీ వెంట ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్డీఈవో బి.శ్రీనివాసకుమార్, వివిధ శాఖాధికారులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ

మంచు మింగేసింది!

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

ద్విచక్ర వాహనదారుడి తల పై నుంచి ట్రాక్టర్

వెళ్లడంతో యువకుడి మృతి



తానేటి హరిశ్చంద్ర ప్రసాద్‌బాబు(ఫైల్)

నల్లజర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పొగ మంచు ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఓ వ్యాన్ ఢీకొనడంతో కిందపడిపోయిన ఆ వాహనదారుడి తల పైనుంచి ట్రాక్టర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా పోతవరం పాత పేటకు చెందిన తానేటి ప్రసాద్, భూలక్ష్మి దంపతులకు హరిశ్చంద్రప్రసాద్‌బాబు (24), కృష్ణబాబు, మమత సంతానం. ప్రసాద్‌కు ఆరు నెలల క్రితం నబీపేటకు చెందిన చిన్నారితో వివాహమైంది. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. ప్రసాద్ జంగారెడ్డిగూడెంలోని ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పోతవరం నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్తుండగా షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కొయ్యలగూడెం నుంచి నల్లజర్ల వైపు ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వ్యాన్ ఢీకొంది. దీంతో ప్రసాద్ కింద పడిపోయాడు. ఆ సమయంలో నల్లజర్ల నుంచి కొయ్యలగూడెం వైపు వెనుక వస్తున్న ట్రాక్టర్ అతని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడిక్కక్కడే మృతిచెందాడు. మంచు ప్రభావంతో డ్రైవర్లకు కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏ ఎస్ఐ మోహన్ రావు తెలిపారు.



ఘటనా స్థలంలో వ్యాన్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు పల్లి రమేష్(ఫైల్)

కొత్తపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట రెడ్డప్ప వారిపేటకు చెందిన ఇద్దరు మోటార్‌సైకిల్‌పై బోడిపాలెం వైపు వెళ్తుండగా అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న లారీ ఆదివారం అర్ధరాత్రి వెనుక నుంచి ఢీకొనడంతో ద్విచక్ర వాహనం వెనుక వైపున కూర్చున్న పల్లి రమేష్(35)కు తీవ్రగాయలయ్యాయి. దీంతో అతడిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం రమేష్ మృతిచెందాడు. కాగా వాహనం నడుపుతున్న పల్లి వినోద్‌కు స్వల్పగాయాలయ్యాయి. రమేష్ తండ్రి చినసత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కాగా రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెయింటింగ్‌పనులు చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్న రమేష్ మృతితో ఆ కుటుంబానికి దిక్కెవరంటూ భార్య వరలక్ష్మి రోధిస్తున్న తీరు కలిచివేసింది.

ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ప్రార్థనల బ్యానర్

కొవ్వూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్‌లో మత ప్రార్థనలు నిర్వహించిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రైల్వేస్టేషన్ సమీపంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహంలో ఆదివారం అరుణోదయ ఆరాధనల పేరుతో మత ప్రార్థనలు నిర్వహించారు. వాటిని అటుగా వెళ్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధి కంటమణి రామ్‌కుమార్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడంతో విషయం బయటపడింది. మత ప్రార్థనలు ఇష్టం లేకపోవడంతో భవనం కిందకు వెళ్లిపోయామని విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల నుంచి సమాచారం తెలుసుకున్న వార్డెన్ హాస్టల్‌కు చేరుకుని ప్రార్థనలను నిలుపుదల చేశారు. దీనిపై హాస్టల్ అధికారి ఆర్.చిరంజీవిని ప్రశ్నించగా భవన యజమానులు ప్రార్థనలు పెట్టుకుంటామని అడిగారని, ప్రభుత్వ భవనంలో ప్రార్థనలు నిర్వహించరాదని చెప్పామని, తాను ఇంటికి, హాస్టల్ విద్యార్థులు ఆడుకోవడానికి వెళ్లిన సమయంలో భవన యజమానులు అనధికారికంగా అద్దెకు ఇచ్చిన పైఅంతస్తులో మత ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారని, సమాచారం తెలిసిన వెంటనే హాస్టల్‌కు వచ్చి ప్రార్థనలను నిలుపుదల చేయించామని పేర్కొన్నారు.

గోదావరిలో బాలిక మృతదేహం లభ్యం

తల్లి మందలించిందని ఇంటి నుంచి అదృశ్యం

కేసు నమోదు చేసిన పోలీసులు



మట్టపర్తి బేబి (ఫైల్)

మామిడికుదురు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బి.దొడ్డవరం గ్రామంలో ఆదివారం అదృశ్యమైన బాలిక మట్టపర్తి బేబి (14) మృతదేహం అప్పనపల్లి గోదావరిలో సోమవారం లభ్యమైంది. బేబి పెదపట్నంలంక జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తన స్నేహితురాలి వద్ద నుంచి బంగారు గొలుసు తీసుకుని దాన్ని మరొక స్నేహితురాలికి ఇచ్చినట్టు తల్లికి చెప్పింది. తన గొలుసు ఇవ్వమని స్నేహితురాలు తండ్రితో వచ్చి ఆ బాలికను అడగ్గా, ఇచ్చేసినట్టు వారికి బేబి చెప్పింది. సోమవారం నాటికి తన గొలుసు ఇచ్చేయాలని స్నేహితురాలు చెప్పింది. దీంతో శనివారం సాయంత్రం బేబిని తల్లి మందలించింది. ఇది జరిగిన కొద్దిసేపటికే బేబి అదృశ్యం కావడంతో బాలిక తల్లి నగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి వెనుకే గోదావరి నది ఉండడంతో అదృశ్యమైన బేబి నదిలో దూకేసి ఉంటుందని అనుమానించి ఆదివారం గాలింపు చేపట్టినప్పటికీ ఏవిధమైన ఆచూకీ తెలియలేదు. సోమవారం బాలిక మృతదేహం అప్పనపల్లిలో లభించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వసంత పంచమి వేడుకలు

అమలాపురంటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యానిధివిద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం వసంత పంచమిని వేడుకగా జరుపుకున్నారు. విద్యాసంస్థల చైర్మన్ ఏబీ నాయుడు వసంత పంచమి విశిష్టతను, సకల విద్యలకు సరస్వతీదేవి ఆధారమని, సరస్వతీపూజ విశిష్టతను వివరించి, చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

సాయం అందజేత

అల్లవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దేవగుప్తంలో అగ్నిప్రమాద బాధితులు బుంగ చిట్టిబాబు కుటుంబాన్ని, దివ్యాంగులైన వారి కుమార్తెలకు కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారిచంద్రశేఖర్, హైదరాబాద్ మీనాక్షి ఫౌండేషన్ తరఫున నాయకులు బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, మంచాలు, దుస్తులు అందజేశారు.

మార్చి నుంచే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలి: డీఈవో

కాట్రేనికోన, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఈఏడాది మార్చి నుంచే అకడమిక్ సంవత్సరానికి పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంపుదలకు కృషి చేయాలని డీఈవో సలీంబాషా ఉపాధ్యాయులకు సూచించారు. చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో సోమవారం 9వదశ ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకటవ తరగతి విద్యార్థికి కూడా భాష, గణితంపై ప్రాథమిక భావనలతో కూడిన పునాది అవసరమన్నారు.ప్రతిఉపాధ్యాయుడు ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష ఏఎంవో పి.రాంబాబు అన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1,245పాఠశాలల్లో 950మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పొందినట్టు తెలిపారు. చివరిస్పెల్‌లో 371మంది శిక్షణ పొందుతున్నారని వివరించారు. సమావేశంలో డైట్ అధ్యాపకురాలు కె.కళావతి, ఎంఈవోలు వైవీవీ సత్యనారాయణ, రాయుడు ఉదయభాస్కరరావు, కేఆర్పీలు అంకం చంద్రసూర్యం, ఎ.కొండలరావు, డీఆర్పీలు పాల్గొన్నారు.



ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

స్కౌట్ అండ్ గైడ్స్‌తో దేశభక్తి

స్కౌట్ అండ్ గైడ్ శిక్షణ ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ విద్యార్థులకు అలవడుతుందని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో స్కౌట్ మాస్టర్స్ అండ్ గైడ్ కెప్టెన్స్‌కు నిర్వహించిన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సమాజ సేవకులుగా తీర్చిదిద్దడానికి ప్రారంభించిన బాలభట ఉద్యమాన్ని బలోపేతం చేయవలసిన బాధ్యత శిక్షణ పొందిన ఉపాధ్యాయులపై ఉందన్నారు. ట్రైనింగ్ సెంటర్ కోర్సు డైరెక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో సహనం, స్నేహశీలత, ఉత్సాహం, పట్టుదల స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా అలవడుతుందన్నారు. సమగ్రశిక్ష అధికారులు జి.ప్రవీణ్‌కుమార్, బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఎంఏకే భీమారావు, లీడర్ ఆఫ్ ట్రైనీస్ శివనాగిరెడ్డి, సుగుణారాజేంద్రన్, అసిస్టెంట్ సుబ్బలక్ష్మి, టీవోటీలు హెబ్సీబా, దుర్గామాధవి, గోపాలకృష్ణ, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

'7న చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భైరవమూర్తి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశంపై నిర్లక్ష్యం వహిస్తున్నందున ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఈనెల7న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి పిలుపునిచ్చారు. నడిపూడి డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ ప్రాంగణంలో ఆకుమర్తి రమేష్‌మాదిగ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి మాదిగ ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భైరవమూర్తి మాట్లాడుతూ లక్ష డప్పులు.. వేల గొంతుకల పేరుతో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జిల్లాలోని మాదిగ సోదరులు విజయవంతం చేయాలని కోరారు. డప్పులు మోగించుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడంతో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా, మండలశాఖల ప్రతినిధులు సత్తాల దుర్గారావు, యార్లగడ్డ రామకృష్ణ, లూటుకుర్తి సత్యనారాయణ, వీధి చిరంజీవి, వంగలపూడి నరసింహమూర్తి, చుట్టుగుళ్ల సత్తిబాబు, నేదునూరి నతానియేలు, గంపల సత్యదుర్గాప్రసాద్, ఆకుమర్తి ఆశీర్వాదం, మల్లవరపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



నడిపూడిలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు

మురమళ్ల మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



ఉత్సవాలకు భూమి పూజచేస్తున్న గ్రామస్తులు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మురమళ్ల భద్రకాళీవీరేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. పందిరిరాట ముహూర్తం చేశారు. ఈనెల26 నుంచి మార్చి 2వరకు ఉత్సవాలు జరగనున్నాయి. స్వామికి ద్వాదశ పుష్కర నదీజలాలతో అభిషేకం చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు జంపన బాబు, కటారి రామవెంకటసుబ్బరాజు, సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, ఉండి దత్తుశర్మ, పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి, స్వస్తి వాచకుడు నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ నేత దొమ్మేటి అంత్యక్రియలు





బోడసకుర్రులో దొమ్మేటి బాబూరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్

అల్లవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు, బోడసకుర్రు మాజీ సర్పంచ్ దొమ్మేటి వెంకటస్వామి (బాబూరావు) అంత్యక్రియలు సోమవారం బోడసకుర్రు వైనతేయ నదీతీరాన జరిగాయి. అశ్రునయనాలతో వందలాది మంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి మనుమడు అయిన దొమ్మేటి వెంకటస్వామి (బాబూరావు) భౌతికకాయానికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర నేత పెచ్చెట్టి చంద్రమౌళి, అల్లవరం ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, గుబ్బల రాంప్రసాద్, వాసంశెట్టి చినబాబు, కేతా కిరణ్, బొంతు సత్యనారాయణ, రాయుడు సత్యరుణిచ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, దొమ్మేటి పండు తదితరులు బాబూరావుకు ఘన నివాళులర్పించారు.

బోనాల సంబరం



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కామనగరువు శ్రీసిద్ధినాగదుర్గమ్మ వీరభద్రుల గద్దె ఆధ్వర్యంలో వందలాది మంది భక్తుల ఆధ్వర్యంలో సోమవారం బోనాల సంబరాన్ని నిర్వహించారు. గరగనృత్యాలతో కామన కృష్ణమాధవరావు-సీతాభవానీ (దేవుడమ్మ)తో కలిసి ఊరేగింపు నిర్వహించారు. వీరభద్రుల వీరగనికలు-నేతికొండ వీరన్నబాబుల 26వ బోనాల సంబర మహోత్సవం వైభవంగా సాగింది. స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు పోశారు. ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ పూజాధికాల్లో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, ప్రముఖులు పాల్గొన్నారు. అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

కుండలేశ్వరం రోడ్డుకు మహర్దశ

కాట్రేనికోన, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కుండలేశ్వరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారికి మహర్దశ పట్టనుంది. 5కిలో మీటర్ల మేర రూ.5కోట్లతో రోడ్డు ఆధునికీకరణకు ప్రభుత్వానికి నివేదించినట్టు ఆర్అండ్‌బీ ఏఈ ఆశ్రిత తెలిపారు. రోడ్డు పక్కనే ఉన్న కెనాల్ వెంబడి రక్షణ గోడ, రోడ్డు విస్తరణకు మరో రూ.15కోట్లతో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.

నేటి నుంచి విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడిలోని శ్రీఉమావల్లభేశ్వరస్వామివారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయం జీర్ణావస్థకు చేరడంతో రూ.1.20కోట్లు దేవదాయ-ధర్మాదాయశాఖ, భక్తులు సమకూర్చిన విరాళాలతో శివాలయ పునఃప్రతిష్ఠ, గణపతి, ఉమాదేవి, వల్లభేశ్వరస్వామి, నంది, కాలభైరవస్వామి, దక్షిణామూర్తి, చండీశ్వర, నూతన ధ్వజస్తంభం, నవగ్రహాలు, ద్వారపాలకులు వంటి ఉపఆలయాలను నిర్మింపచేశారు. ఆలయ ప్రాంగణం, చుట్టుపక్కల విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల విగ్రహాలు ఏర్పాటుచేశారు. శైవాగమ వేదపండితులు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య పర్యవేక్షణలో పండితులు బాదంపూడి సత్యనారాయణశర్మ, ఉండి సుబ్రహ్మణ్యశర్మ, పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి, పూజ్యంకిశోర్‌శర్మల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బాదంపూడి దుర్గన్న కుమారులచే శివాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈవిగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, భజనా కార్యక్రమాలు, భరతనాట్యం, కూచిపూడి నాట్యాలు వంటి వాటిని ఏర్పాటుచేశారు. 7న ధాన్యాదివాసంగ బిందోత్సాసన, మండపార్చన, పంచశయ్యాదివాసం, 8న ఉదయం 11.21 గంటలకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు, యంత్రస్థాపన, అనంతరం అన్నసమారాధన జరుగు తాయి. అలాగే ముమ్మిడివరంలో రూ.90లక్షలతో పునర్నిర్మించిన శ్రీరుక్మాంబ సమేత పాండురంగస్వామి ఆలయంలో పంచయాతన సంపూర్ణ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల5నుంచి 7వరకు నిర్వహించనున్నారు. ముమ్మిడివరంలోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి, కాశీవిశ్వేశ్వరుడు-అన్నపూర్ణాదేవి,లక్ష్మీనారాయణస్వామి, వేణుగోపాలస్వామి, సూర్యభగవానుడు, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి ఉపాలయాలను నిర్మింపచేశారు. విళ్ల ఈశ్వరరావు-మాధవి, విళ్ల గణేష్-సౌజన్య దంపతులచే శ్రీ పాండురంగస్వామి ఆలయాలను పునర్నిర్మించారు.వేదపండితులు సుదర్శనం వెంకటజనార్ధనాచార్యుల ఆధ్వర్యంలో పునర్నిర్మాణ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠలు జరగనున్నాయి.

జిల్లాలో 1,60,893 ఎకరాల్లో వరినాట్లు పూర్తి



కోదూరుపాడులో ఈకేవైసీ పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు

అల్లవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకు 1,60,893 ఎకరాల్లో వరినాట్లు, 57,334 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు చెప్పారు. కోదూరుపాడులో ఈ-పంట నమోదును పరిశీలించారు. 10వతేదీలోగా ఈ-పంట నమోదు పూర్తి చేయాలన్నారు. అల్లవరం మండలంలో 3619ఎకరాల్లో వరినాట్లు, 3200ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయిందన్నారు. వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 2ఎంఎల్‌చొప్పున పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి నందెపు వీరవెంకటసత్యనారాయణ, ఎం.శుభగణేష్, బొంతు యుగశ్రావణి, పాటి సింహాద్రి, పిల్లా సత్యనారాయణ, ఈదరపల్లి సత్యనారాయణరాజు, పితాని సత్యనారాయణ, నగ వెంకటస్వామి పాల్గొన్నారు.

మాతృత్వాన్ని చాటిన శునకం



పేరూరులో పిల్లికి పాలిస్తున్న శునకం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పిల్లి కనిపిస్తే చాలు శునకాలు దాడి చేసే రీతిలో తరిమేస్తాయి. వాటి మధ్య అంత వైరం ఉంది. కానీ అదే పిల్లి ఆకలి తీరేవరకు ఆ శునకంపై ప్రేమగా పడుకుని మరీ పాలు తాగడం చిత్రమే మరి. పేరూరు ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో సోమవారం ఉదయం మాతృత్వాన్ని చాటుకున్న శునకాన్ని పలువురు ప్రేమగా చూశారు. ఆ శునకం కొంతకాలం క్రితం నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. అయితే ప్రమాదవశాత్తూ మూడు కుక్కపిల్లలు చనిపోయాయి. ఇక మిగిలిన పిల్లతోనే ఆ శునకం ఉంటుంది. పిల్లకుక్క సమక్షంలోనే పిల్లి పాలు తాగడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ఆనందోత్సాహాలతో హజరత్ అబ్బాస్ జయంత్యుత్సవం



మామిడికుదురు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ముస్లిం మతస్థుల ఆరాధ్య దైవం, ఇమామ్ హుస్సేన్ సేనాధిపతి హజరత్‌అబ్బాస్ జయంత్యుత్సవాన్ని భక్తులు సోమవారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరిపారు. ఈసందర్భంగా నగరం, మొగలికుదురులో మిలాద్ జరిగింది. మామిడికుదురులోని హజరత్‌అబ్బాస్ పంజాలో రిజ్వాన్‌హుస్సేన్, నన్నేసాహుస్సేన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ అబ్బాస్ ఔన్నత్యాన్ని వివరించారు. కర్బలా పుణ్యభూమిలో హజరత్ అబ్బాస్ పాత్రను భక్తులకు తెలియచేశారు. ఇస్లాం చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని కొనియాడారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీతారామాలయంలో సప్తాహ మహోత్సవాలు

అల్లవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అల్లవరం సీతారామాలయం వద్ద పదకొండో సప్తాహ పూజలు ఘనంగా జరిగాయి. బండిగుప్తాపు చిట్టివెంకన్న-సీతారామలక్ష్మి దంపతులచే పురోహితులు పోచినపెద్ది మురళీ, పెద్దింటి వెంకటకృష్ణ శాస్త్రి సప్తాహ కలశస్థాపన పూజలు చేయించారు. ఈనెల10వరకు ఏడు రోజులు వివిధ భజన మండళ్ల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ తెలిపింది.

పెన్నులు పంపిణీ

అంతర్వేది,ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం, మోరి, విశ్వేశ్వరాయపురం హైస్కూళ్లకు చెందిన పదోతరగతి విద్యార్థులు 150మందికి కేశవదాసుపాలెం యూనియన్ బ్యాంకు ఉద్యోగి పోతురాజు ఉమాసాయి పెన్నులు, ప్యాడ్లు, పరీక్ష సామగ్రిని అందించారు.

పుస్తెలతాడు లాక్కొని పరార్

మామిడికుదురు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామంలో సోమవారంమహిళ మెడలో పుస్తెలతాడును లాక్కొని ఇద్దరు దుండగులు పరారయ్యారు. గ్రామానికి చెందిన ముత్యాల విజయకనకదుర్గ గంగాభవానీ సాయంత్రం 5.30 గంటలకు ఇంటి ఎదురుగా రోడ్డులో వాకింగ్ చేస్తుంది. గుర్తుతెలియని దుండగులు ఇద్దరు మోటారు సైకిల్‌పై వచ్చి తన మెడలోని పుస్తెలతాడు లాక్కొని పరారయ్యారు. దీనిపై నగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎ.చైతన్యకుమార్‌తెలిపారు.

12న ఫీజు పోరు ధర్నా

అల్లవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద మార్చి12న చేపట్టే ఫీజు పోరు ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైసీపీ నాయకులు, కళాశాల యాజమాన్యాలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులను అన్నివిధాలా ఆదుకుందని, ప్రస్తుత ప్రభుత్వం రూ.3900కోట్లు బకాయిలు చెల్లించనందున ధర్నా చేస్తున్నామన్నారు.

జాతీయ మహిళా వైద్య దినోత్సవం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు మహిళా వైద్యులను సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో డాక్టర్ గోటేటి భారతి, డాక్టర్ గంధం భవానీలతో పాటు పలువురిని సత్కరించారు. ఆధునిక సమాజంలో మహిళా వైద్యుల ప్రాధాన్యతను వివరించారు. కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, శ్రీగిరి పద్మావతి, పుత్సా రాజేశ్వరి, దువ్వూరి సుబ్బలక్ష్మి, భమిడిపాటి పద్మావతి, యర్రమిల్లి షణ్ముఖి, శిష్టా లక్ష్మి, పచ్చిగోళ్ల సుధ, సత్యకుమారి, పేరి లలిత పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ పంపిణీ

అంబాజీపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు 20మందికి ఎస్టీయూ సభ్యులు గాది శ్రీనివాసరావు, ఆదుర్తి అప్పారావు, గంటి శ్రీనివాస్, పినిపే సత్యనారాయణ, కందాల గణేష్, వలవల బాలాజీలు సమకూర్చినస్టడీమెటీరియల్‌ను అందించారు.

ఉత్సవాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

అంతర్వేది, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ప్రాంగణంలో జరిగే తీర్థ మహోత్సవాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపై ఉందని ఏపీ ఎన్జీసీ మోనటరింగ్ అధికారి గండేపల్లి ప్రభావతి చెప్పారు. చిత్తడి నేలల సంరక్షణలో భాగంగా నాలుగో రోజు దేవాలయాల పరిసరాలు, బీచ్‌ను శుభ్రం చేసే కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిసరాల శుభ్రత, చిత్తడి నేలల సంరక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సెయింట్ మేరీ స్కూలు ఫాదర్ జేసురాజు, జీవీపుంత విద్యార్థులు, హెచ్ఎం మల్లికార్జునరావుపాల్గొన్నారు.

5వేల వాటర్ బాటిళ్లు వితరణ

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన పడాల రాంబాబు 5వేల వాటర్ బాటిళ్లను ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీకి అందించారు. కార్యక్రమంలో రావూరి నాగు, గుబ్బల ఫణికుమార్, నామన నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పైపులైను పగిలిపోయినా పట్టించుకోరా!

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నవంతెన వద్ద మంచినీటి పైపులైను పగిలిపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్ పగిలిపోవడంతో ట్యాప్‌ల ద్వారా మురికినీరు వస్తుందని, ఎన్నిసార్లు అధికారులు, కౌన్సిలర్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కుళాయిల ద్వారా మురికినీరు వస్తుందని, ఆ నీరు తాగితే రోగాల బారిన పడడం తథ్యమని స్థానిక మహిళలు అధికారులు, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ఆదేశించారు.

రూ.6వేలు జరిమానా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఆదేశాల మేరకు సోమవారం అమలాపురం ముస్లిం వీధిలో ఉన్న ఢిల్లీ దర్బార్ హోటల్‌ను కార్యదర్శి బండి వీరన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్ రూమ్ అపరిశుభ్రంగా ఉండడంతో పాటు హోటల్ వ్యర్థాలను డ్రైన్‌లో పడవేయడంతో యజమాని మహ్మద్‌ఆజాంకు రూ.6వేలు జరిమానా విధించారు. హోటల్ యజమానికి పలు సూచనలు చేశారు. శుభ్రతను పాటించకపోతే హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మరో కార్యదర్శి వి.సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వినూత్న బోధన

మలికిపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మోరి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు అడబాల గంగాప్రసాద్ విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన చేయాలని నిర్ణయించారు. సక్సెస్ ఫుల్ వ్యక్తుల జీవితాలను విద్యార్థులకు వివరించి వారిలో జీవితంలో పైకి రావాలనే తలంపు తీసుకురావాలని నిర్ణయించారు. సోమవారం ఆరుగురు 9వ తరగతి విద్యార్థులను ఎంపికచేసి వారితో మలికిపురానికి చెందిన ఎన్ఆర్ఐ గెద్దాడ నాగేశ్వరరావుతో ఇంటర్వ్యూ ఏర్పాటు చేశారు. గెద్దాడ నాగేశ్వరరావు జీవిత చరిత్రను విద్యార్థులు ఇంటర్వ్యూ చేసి జీవితంలో ఎలా పైకి వచ్చారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ చిన్న విషయానికి ఆందోళన చెందరాదని, కష్టాన్ని ఎలా ఎదుర్కొవాలో వివరించారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

ముమ్మిడివరం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): అనాతవరం గ్రామానికి చెందిన కొడమంచిలి సత్యనారాయణ గత ఏడాది అక్టోబరు 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సత్యనారాయణకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో పార్టీ కార్యకర్తలకిచ్చే ప్రమాద బీమా రూ.2లక్షలు టీడీపీ సహాయనిధి నుంచి మంజూరైంది. ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు బాధితుడి భార్య కొడమంచిలి మరియమ్మకు సోమవారం అందించారు. టీడీపీ నాయకులు కురసాల శివబాబు, జనసేన నాయకులు గుద్దటి జమి, ఖండవల్లి ఏలియా, జె.రాజు, కొడమంచిలి చంటి పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి పరామర్శ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో బాధపడుతున్న వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణను వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. బాలకృష్ణ మాతృమూర్తి సత్యవతి ఇటీవల మృతిచెందారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన జగన్మోహన్‌రెడ్డి బాలకృష్ణను ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. బాలకృష్ణ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

విగ్రహాలకు ముసుగులు వేసి, ఫ్లెక్సీలు తొలగించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ విధించడంతో గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, ఫ్లెక్సీలను తొలగించాలని ఎంపీడీవో జీవీ సరోవర్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల కోడ్‌ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో కార్యక్రమాలు ఎన్నికలకోడ్‌కు లోబడి నిర్వహించాలని సూచించారు.

'ఫీజుపోరు'ను విజయవంతం చేయండి

అంబాజీపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 12న అమలాపురంలో నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు కోరారు. అంబాజీపేటలో వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరావు, దొమ్మేటి సత్యమోహన్, పేరి శ్రీను, ఎం.ఎం.శెట్టి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్, ట్రక్కుఆటో ఢీ: ముగ్గురికి గాయాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌ను ట్రక్కుఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఆదివారం అర్ధరాత్రి అంబాజీపేట మండలానికి చెందిన 108 అంబులెన్సు అమలాపురం ఏరియా ఆసుపత్రి నుంచి పేషెంట్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్తుంది. 216జాతీయ రహదారి ముమ్మిడివరం బైపాస్ రోడ్డు కొండాలమ్మ చింత సమీపంలో కాకినాడ వైపు నుంచి అమలాపురం వైపు చేపల లోడుతో వెళుతున్న ట్రక్కు ఆటో అంబులెన్సును ఢీకొట్టింది. దీంతో ట్రక్కు ఆటో డ్రైవర్ ఉప్పాడకు చెందిన పేరూరి నాగవెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడగా, 108 అంబులెన్సు డ్రైవర్, టెక్నీషియన్ స్వల్పంగా గాయపడ్డారు. ముమ్మిడివరం పోలీసులు కేసుదర్యాప్తు చేపట్టారు. 108 అంబులెన్స్ ముందు భాగంగా నుజ్జునుజ్జు అయింది. తీవ్రంగా గాయపడ్డ ట్రక్కు ఆటో డ్రైవర్‌ను, అంబులెన్స్‌లో ఉన్న పేషెంట్‌ను మరో అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'మహిళల్లో సామాజిక మార్పు వచ్చింది'

రాజోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల ద్వారా మహిళా సాధికారతతో పాటు గొప్ప ఆర్థిక, సామాజిక మార్పు వచ్చిందని ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ చెప్పారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ సారథ్యంలో ఎన్నికైన స్త్రీ ప్రజాప్రతినిధుల పాత్ర గ్రామ పంచాయతీల ప్రాతినిధ్యం అనే అంశం మీద సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బోస్, పీఆర్వీ ఎస్.రాజు, అశ్వినీ, దయాసాగర్, విద్యార్థులుపాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పి.గన్నవరం నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యుడు నామన రాంబాబు కోరారు. పాశర్లపూడి గ్రామంలో సోమవారం టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియచేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతీ నాయకుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మద్దాల కృష్ణమూర్తి, భూపతిరాజు సాయిబాబురాజు, మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, నాయకులు ఈలి శ్రీను, బోనం బాబు, సూదా బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, దొంగ సత్తిబాబు, ముక్రం హుస్సేన్, గంధం భాస్కర్, మల్లాడి విష్ణు, మొల్లేటి పార్వతి, కడలి కృష్ణమోహన్, అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

జ్యోష్ణవీదుర్గకు అవార్డు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం గతనెల2వ తేదీన వాగ్దేవీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి వేదగణిత పోటీల్లో మురమళ్ళ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థిని జ్యోష్ణవీదుర్గ ప్రథమ స్థానం సాధించింది. డీఈవో సలీంబాషా చేతుల మీదుగా సోమవారం జ్యోష్ణవీదుర్గ అవార్డు అందుకుంది. పాఠశాల యాజమాన్య కమిటీకి చెందిన గోకవరపు వెంకట్రాజు, వీరభద్రకుమారి పాల్గొన్నారు.

ఫీజు పోరుకు తరలిరండి

మలికిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి కూటమి ప్రభుత్వం వారితో చెలగాటమాడుతూ అరాచక పాలన సాగిస్తోందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మార్చి 12న జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగే వైసీపీ ఫీజు పోరు కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేఎస్ఎన్ రాజు, కటకంశెట్టి ఆదిత్య, పాటి శివకుమార్, రుద్రరాజు చిన్నా, జాన శంకరరావు, బొలిశెట్టి భగవాన్, కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,36,809 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి మండపేటకు చెందిన మేకా సత్యసాయి కాశీవినయ్ కుటుంబ సభ్యులు రూ.1.16 లక్షల విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

సఖిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం కట్టుంగ పార్వతీ సమేత సఖిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రూ.1.25 కోట్లతో పురాతన శివాలయ పునర్నిర్మాణానికి దాతలు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. సోమవారం శంకుస్థాపన మహోత్సవం కన్నుల పండువగా జరిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు హాజరయ్యారు.


కట్టుంగ శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

సుందరపల్లి నుంచి తిరుమలకి సుభాష్ అభిమాని పాదయాత్ర

కె.గంగవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరపల్లి గ్రామానికి చెందిన రంకిరెడ్డి మణికంఠ పాదయాత్ర ద్వారా తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరారు. సార్వత్రిక ఎన్నికల్లో కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ విజయం సాధించాలని ఆయన మొక్కుకున్నారు. తన మొక్కు చెల్లించేందుకు నడక యాత్ర ద్వారా సోమవారం ఉదయం తిరుమలకు బయలుదేరారు. ముందుగా సుందరపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి మంత్రి సుభాష్‌తో తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర చేస్తున్న మణికంఠను గ్రామస్తులు, కూటమి నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీరెడ్డి సత్తిబాబు, సలాది రమేష్, సలాది సత్తిబాబు, దేవరపల్లి చక్రి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రోడ్డు ప్రమాద బాధితులకు మంత్రి సుభాష్ బాసట

ద్రాక్షారామ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద బాధితులకు మంత్రి సుభాష్ బాసటగా నిలిచారు. రామచంద్రపురం శాంతినగర్‌కు చెందిన జుత్తుగ హుస్సేన్, జుత్తుగ లక్ష్మి ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అదే సమయంలో మంత్రి ఒక వేడుకకు హాజరై వస్తుండగా వారి పరిస్థితిని గుర్తించారు. తన వాహనంలో వారిని ఎక్కించుకుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వారి తరలించే చర్యలు తీసుకున్నారు.



ద్వారపూడి పంచాయతీ కమ్యూనిటీ హాలుకు మరమ్మతులు చేయకుండా వదిలేసిన దృశ్యం. పక్క చిత్రంలో మరో భవనం పనుల కోసం వేసిన పునాదులతో ఆగిపోయిన దృశ్యం

పాతది మరమ్మతు చేయరు..కొత్తది పూర్తి కాదు

• ద్వారపూడిలో కమ్యూనిటీ హాల్‌కు పట్టిన దుస్థితి • ప్రజల అసంతృప్తి • చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం

మండపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేస్తామంటూ ఉన్న భవనాన్ని వదిలేసి మధ్యలో మరమ్మతులు చేయకుండా వదిలేశారు. గత ప్రభుత్వంలో మరమ్మతుల కోసం చేసిన నిర్వాకం ఇప్పటి వరకు పూర్తి కాలేదు. గతంలో గ్రామానికి చెందిన సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇక్కడ వేడుకలు నిర్వహించుకునేవారు. ప్రభుత్వ సమావేశాలు, అధికారిక కార్యక్రమాలు ఈ భవనంలో నిర్వహించేవారు. అనంతరం మరమ్మతుల పేరిట భవనానికి వున్న కిటికీలు, తలుపులు తొలగించి ఆధునీకరించేందుకు చేసిన పనులు అప్పటి నుంచి అడుగు కూడా ముందుకు సాగలేదు. దీంతో కమ్యూనిటీ హాల్ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా కమ్యూనిటీ హాల్ పక్కనే మరో అదనపు భవనం నిర్మించేందుకు వేసిన పునాది స్థాయి ముందుకు కదలడం లేదు. ఇటు పాత కమ్యూనిటీ హాలు మరమ్మతులకు నోచుకోక, నూతన భవనం పునాదులు దాటక రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. కూటమి ప్రభుత్వం ఈ భవనాలపై దృష్టిసారించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాత భవనం మరమ్మతులు, పక్కనే మరో భవనం పనుల గురించి మండల ఇంజనీర్‌ను వివరణ కోరగా ద్వారపూడిలో కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, నూతన కమ్యూనిటీ హాల్ గురించి తనకు తెలియదని ఆయన సమాధానం ఇచ్చారు.

5వేల వాటర్ బాటిళ్లు వితరణ

అంతర్వేది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన పడాల రాంబాబు 5వేల వాటర్ బాటిళ్లను ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీకి అందించారు. కార్యక్రమంలో రావూరి నాగు, గుబ్బల ఫణికుమార్, నామన నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణోత్సవానికి భద్రతా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఎస్పీ రఘువీర్

భీమేశ్వరస్వామి కల్యాణోత్సవ ఏర్పాట్లపై డీఎస్పీ పరిశీలన

ద్రాక్షారామ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాల ఏర్పాట్లపై సోమవారం డీఎస్పీ రఘువీర్ పరిశీలించారు. స్వామివారి కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం తదితర కార్యక్రమాల నిర్వహణపై ఆలయంతోపాటు, ప్రాంగణం, సప్త గోదావరి నదీతీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. రథోత్సవం, తెప్పోత్సవం నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సీఐ వెంకట నారాయణ, ఎస్ఐ లక్ష్మణ్‌లకు పలు ఆదేశాలు ఇచ్చారు.

7 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న వైభవ వెంకటేశ్వరస్వామి దశమ బ్రహ్మోత్సవాలు ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు కె.బాలబాలాజి ఆధ్వర్యంలో పాలకొల్లుకు చెందిన శ్రీఖరి శ్రీనివాస పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరగనున్నాయని వక్తలు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


నవాబుపేటలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రాజు

సీసీ రోడ్ల పనులు వేగవంతం

ఆలమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) ఆలమూరు మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మండల ఇన్‌చార్జి ఎంపీడీవో ఐదం రాజు సోమవారం పరిశీలించారు. మండలంలో రూ.2.47 కోట్లతో 11 గ్రామాల్లో 17 సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో అరుణకుమారి, మండల ఇంజనీరింగ్ అధికారి వీరభద్రరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వున్నారు.

‘పేరాబత్తుల గెలుపునకు కృషి చేయాలి’

కూటమి కార్యకర్తలకు మంత్రి సుభాష్ విజ్ఞప్తి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను మెజార్టీతో గెలిపించాలని మంత్రి సుభాష్ తెలిపారు. సోమవారం లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ అధ్యక్షతన జరిగిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలో రూ.6.63 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతుకులమయంగా ఉన్న రోడ్లను బాగు చేశామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు కె.రామారావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, మాజీ ఏఎంసీ చైర్మన్లు కొమరిన వీర్రాజు, గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు కర్రి చిట్టిబాబు, జనసేన నాయకులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సలీంబాష

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కె.గంగవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో సలీంబాషా అన్నారు. సోమవారం ఆయన కె.గంగవరం, పామర్రు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులను పలు సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.


ఆలమూరులో వసంత పంచమిని పురస్కరించుకుని పూజల్లో పాల్గొన్న విద్యార్థులు


రావులపాలెం సత్యసాయిబాబా మందిరంలో సామూహిక అక్షరాభ్యాసం పూజల్లో పాల్గొన్న చిన్నారులు


కోటిపల్లిలో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

ఘనంగా వసంత పంచమి పూజలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపాలెం శివశివాని హిందూ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఎంఈవో ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎంఈవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో కవి జి.బ్రహ్మాజీ, ప్రిన్సిపాల్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): చెముడులంకలోని శ్రీషిర్డిసాయి విద్యానికేతన్‌లో సోమవారం వసంత పంచమిని వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రాంగణంలో సరస్వతిదేవి విగ్రహాన్ని పాఠశాల డైరెక్టర్ ఉషారాణి చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలలో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిపిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో వసంత పంచమి వేడుకలు జరిగాయి. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు జరిపారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. మండలంలోని 12 గ్రామాల్లో వసంత పంచమిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సత్యసాయిబాబా సేవా మందిరంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. వసంత పంచమిని పురస్కరించుకుని జరిపిన ఈ కార్యక్రమంలో సమీప ప్రాంతాల చిన్నారులు పూజల్లో పాల్గొన్నారు. పి.సీతారామమూర్తిశర్మ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మన్యం పర్వత వర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిపల్లి విజ్ఞానభారతి పాఠశాలలో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం జరిపారు. ప్రత్యేక పూజల అనంతరం పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విద్యాబాల మందిర్ పాఠశాలలో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతిదేవికి విద్యార్థులు పూజలు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్షలు

రావులపాలెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజమహేంద్రవరానికి చెందిన ఐఏసీఈ, కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, డైరెక్టర్ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అభయాంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమిల్లి గ్రామంలో గోదావరి నదీతీరాన కొలువై ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా జరిపారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

← కోరుమిల్లిలో కొలువై ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామివారు


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖరరావు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

రాయవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ మేనేజర్ చంద్రశేఖరరావు వితరణతో మహాత్మాగాంధీ ప్రాథమిక పాఠశాలకు పుస్తకాల పంపిణీని సోమవారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ గంధం ప్రసాద్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు దాతలు సహకారం అం దిస్తే చదువులో వారు మరింత రాణిస్తారన్నారు. అనంతరం మేనేజర్ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు రెండు కుర్చీలను అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు కె.నాగరాజు, మనిషా, ఉపాధ్యాయులు పి.రామకృష్ణ, తాతాజీ పాల్గొన్నారు.


ర్యాలిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సంజీవ్

ఉచిత వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలీ గ్రామంలో సోమవారం ఏవీఆర్ ఛారిటబుల్ ట్రస్టు అల్లం వరప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రావులపాలెం కేకే ట్రస్టు ఆసుపత్రి, బుద్ధుడు కంటి ఆసుపత్రి వైద్యులు ఖాసింఖాన్, ఎస్.స్వాతి ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తనయుడు సంజీవ్ ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు పలువురు రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఘనంగా రజకుల బల్లల పండుగ

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో సోమవారం రజకుల బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని రజక కుటుంబాలు, బంధువులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి, పార్వతీ పరమేశ్వరులకు, గంగమ్మతల్లికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఊరి చివరన ఉన్న బల్లలకు, బానలకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.


అంగరలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న రజకులు

మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మురమళ్ల భద్రకాళీవీరేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. పందిరిరాట ముహూర్తం చేశారు. ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. స్వామికి ద్వాదశ పుష్కర నదీజలాలతో అభిషేకం చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు జంపన బాబు, కటారి రామ వెంకట సుబ్బ రాజు, సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, ఉండి దత్తుశర్మ, పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి, స్వస్తి వాచకుడు నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం

అంతర్వేది, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ ప్రాంగణంలో జరిగే తీర్థ మహోత్సవాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అందరిపై ఉందని ఏపీ ఎన్జీసీ మోనటరింగ్ అధికారి గండేపల్లి ప్రభావతి చెప్పారు. చిత్తడి నేలల సంరక్షణలో భాగంగా నాలుగో రోజు దేవాలయాల పరిసరాలు, బీచ్‌ను శుభ్రం చేసే కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిసరాల శుభ్రత, చిత్తడి నేలల సంరక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, సెయింట్ మేరీ స్కూలు ఫాదర్ జేసురాజు, జీవీపుంత విద్యార్థులు, హెచ్ఎం మల్లికార్జునరావుపాల్గొన్నారు.